
శివాలయం దక్షిణ ద్వార రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతా

- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు, జూలై 4 : హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మేళ్లచెర్వు స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో రూ.55 లక్షలతో నిర్మించనున్న ఐదంతస్తుల దక్షిణ రాజగోపురంతో పాటు రూ.1.5 కోట్లతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ పనులకు గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట– విష్ణుపురం రైల్వే మార్గంలో రెండోలైన్‌తో పాటు ప్యాసింజర్ సదుపాయాన్ని త్వరలో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు, జడ్పీటీసీ శాగంరెడ్డి పద్మాగోవిందరెడ్డి, శివాలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మునావర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కోదాడటౌన్ : పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కోదాడ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోదాడ పట్టణంలో రూ.20 కోట్లకు పైగా పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.8 కోట్లు మంజూరు చేశామని, వెంటనే టెండర్లు పిలిచి పనులు పూర్తిచేసే కాంట్రాక్టర్‌కు అప్పగించాలని ఆదేశించారు. రూ.6 కోట్లతో టౌన్‌హాల్ నిర్మాణం, రూ.50 లక్షలతో ఖమ్మం ఎక్స్‌రోడ్డు జంక్షన్ అభివృద్ధి రూ.1.1 కోట్లతో ముఖద్వారాలు, రూ.4.4 కోట్లతో చెరువుకట్ట బజార్ నుండి అనంతగిరి రోడ్డు వరకు మేజర్ డ్రెయిన్ నిర్మాణము చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం ముస్లిం కమ్యూనిటీహాల్ స్థల పరిశీలన చేశారు. అనంతగిరి మండలంలో తాసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ కార్యాలయాల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆర్డీఓ సూర్యనారాయణ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ ఈఈ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకవీడు/ నేరేడుచర్ల : పాలకవీడు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేశారు. అనంతరం నేరేడుచర్ల మున్సిపాల్టీలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలలో డీఎమ్‌హెచ్‌ఓ కోటాచలం, తాసీల్దార్లు శ్రీదేవి, సైదులు, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్మన్ సరిత, మార్కెట్ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ సురేశ్‌రెడ్డి, నాయకులు గోపాల్, మోతీలాల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట, జూలై 4 : జిల్లాలోని మండల పరిషత్‌ల పాలకవర్గం పదవీకాలం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం వారు బాధ్యతలు చేపట్టారు.

- మోతె మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పరిశ్రమల అధికారి సీతారాములు నాయక్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్, ఏపీఓ నగేశ్, ఏపీఎం వెంకయ్య పాల్గొన్నారు.
- ఆత్మకూర్.ఎస్ మండల ప్రత్యేకాధికారిగా నాగేశ్వరశర్మ గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ ఎండీ హసీం, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
- నడిగూడెం మండల ప్రత్యేకాధికారిగా డీఎఫ్‌ఓ సతీశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఇన్‌చార్జి ఎంపీడీఓ ఇమామ్, ఎంపీఓ దుర్గాప్రసాద్ అభినందించారు.
- మేళ్లచెర్వు మండల ప్రత్యేకాధికారిగా జిల్లా సహకార అధికారి ఎస్. పద్మ బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.
- చివ్వెంల మండల ప్రత్యేకాధికారిగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె. జగదీశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ భవాని, సీహెచ్‌ఓ యాదగిరి ఉన్నారు.
- పెన్‌పహాడ్ మండల ప్రత్యేకాధికారిగా సివిల్ సప్లై డీఎం పి.రాములు బాధ్యతలు చేపట్టారు. ఆయనను మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.
- నూతనకల్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా భూగర్భ జలవనరుల అధికారి టి. సుదాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని, అధికారులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, సూపరింటెండెంట్ రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆయనను శాలువాలతో సన్మానించారు.
- పాలకవీడు మండలపరిషత్ ప్రత్యేకాధికారిగా డీటీటీఓ కొమ్ము శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ దయాకర్, ఏపీఓ రాజు ఆయనను అభినందించారు.
- హుజూర్‌నగర్ మండల ప్రత్యేకాధికారిగా ఆర్డీఓ శ్రీనివాసులు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న హుజూర్‌నగర్, పెన్‌పహాడ్ ప్రత్యేకాధికారులు

ఆత్మకూర్.ఎస్ : బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరశర్మ

సూర్యాపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

నీట్ పేపర్‌లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్
- సూర్యాపేట జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

బొడ్రాయిబజార్, జూలై 4 : నీట్ పేపర్ లీకేజీ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సంఘాలు నిర్వహించిన ప్రదర్శనలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, బొమ్మగాని వినయ్, బండి రవి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ పరీక్ష పత్రాలను లీక్ చేసి 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌డీఏ ప్రభుత్వం చెలగాటమాడిందని పేర్కొన్నారు. ఈ విషయమై దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా ప్రధాని స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ విషయంలో కేంద్రం స్పందించకుంటే చలోఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పిడమర్తి భరత్, వినోద్, బానోతు వినోద్, దండి ప్రవీణ్, లింగన్న, లక్ష్మణ్, విష్ణు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల ఎంపికలో అవకతవకలు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సీసీ

పాలకవీడు, జూలై4 : మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా మీసేవ కేంద్రాల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు కేటాయించిన సంఘానికి బదులుగా తమకు ఇష్టమొచ్చిన సంఘాలకు కేంద్రాన్ని కేటాయించేలా సీసీ జిల్లా అధికారులకు సిఫారసు చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో వీఓ–1 కేంద్రానికి మండల అధికారులు మీసేవా కేంద్రాన్ని కేటాయించారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ మాత్రం తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వీఓ–2కు చెందిన అభ్యర్థి దరఖాస్తు మాత్రమే జిల్లా కేంద్రానికి పంపారని బాధితురాలు గురువారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించి సంఘబంధం గ్రూపుల తీర్మానం జరగాల్సి ఉండగా.. అదేమీ లేకుండా ఎవరికీ సమాచారం లేకుండా నేరుగా సిఫారసు చేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని, తాను ఫిర్యాదు చేయడానికి వెళ్తే తన దరఖాస్తు కూడా తీసుకోలేదని బాధితురాలు దొంగల మహేశ్వరి పేర్కొన్నారు. ఈ విషయమై ఏపీఎం అనూరాధ వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా నమస్తే తెలంగాణ యత్నించగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

వీఓ–1కు మీసేవ కేంద్రం కేటాయించినట్లు ఉన్న నోటిఫికేషనన్ పత్రం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాని


కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు నాని

తిరుమలగిరి, జూలై 4 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి కె. నాని ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిసారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

కనకమ్మ మృతికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి సంతాపం

సూర్యాపేట రూరల్, జూలై 4 : సూర్యాపేట జిల్లా సామిల్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తాడోజు సలేంద్రచారి మాతృమూర్తి తాడోజు కనకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి గురువారం ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బూరబాల సైదులు, ఎస్‌కే.రఫీ, ఉన్నారు.


కనకమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న మధుసూదనాచారి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి, జూలై 4 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన అన్ని హామీలు అమలు చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం సుందరయ్య కాలనీలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన వారికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

కొమురయ్య విగ్రహానికి నివాళి

తుంగతుర్తి : రావులపల్లి గ్రామంలో భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నన్నబోయిన సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతిలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. కొమురయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకన్న, నాయకులు తప్పట్ల శంకర్, చింతకుంట్ల ప్రభాకర్, బాబు, మాజీ సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

టీజీఎస్‌పీడీసీఎల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మల్లికార్జున్

మల్లిఖార్జున్

బొడ్రాయిబజార్, జూలై 4 : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం టీజీఎస్‌పీడీసీఎల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పిన్నాని మల్లిఖార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్ మింట్ కంపౌండ్‌లో జరిగిన సంఘం కేంద్ర సీఈసీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. టీఆర్‌వీకేఎస్ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న పిన్నాని మల్లికార్జున్ టీజీఎస్‌పీడీసీఎల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికవడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మండల ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

తిరుమలగిరి, జూలై 4 : ఐదేండ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న జడ్పీటీసీ అంజలీరవీందర్, ఎంపీటీసీలు కొర్రె ప్రవీణ్, రంగమ్మా రవి, పొన్నం సమతా వెంకన్న, బొడ్డు సుజాత సైదులు, కోఆప్షన్ సభ్యుడు మౌలానను గురువారం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలపాటు ప్రజా ప్రతినిధులుగా వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. పదవి ఉన్నా, లేకున్నా ప్రజలమధ్యే ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, నాయకులు నరోత్తం రెడ్డి, బర్ల వెంకన్న, యాకూబ్‌నాయక్, పాషా, కందుకూరి బాబు, సురేందర్, నరేశ్, ఎర్ర శ్రీను, మల్లయ్య, గణేశ్ పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉపాధ్యాయురాలి మెడ నుంచి గొలుసు చోరీ

నందికొండ, జులై 4 : ఉపాధ్యాయురాలిని బైక్‌పై ఇద్దరు వెంబడించి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నందికొండలో గురువారం జరిగింది. సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీకి చెందిన ఉపాధ్యాయురాలు విధులు ముగించుకొని పెద్దవూర పాఠశాల నుంచి నందికొండకు స్కూటీపై వస్తున్నది. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బైక్ పై వెంబడిస్తూ వచ్చారు. హిల్‌కాలనీ పాత ఫిల్టర్ హౌస్ సమీపంలో ఎవరూ లేనిది గమనించి ఆమెను అడ్డగించి మెడలోని 4 తులాల బంగారు గొలుసును దొంగలించారు. సీసీ కెమెరాలో లభించిన వారి చిత్రాలలో వీరు ఇద్దరిలో ఒక్కరు తెల్ల జీన్స్, మరొకరు రెడ్ కలర్ జాకెట్‌ను బ్లాక్ జర్కిలను ధరించి మాచర్ల వైపు వెళ్లారు. ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపడు తున్నామన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్

బొడ్రాయిబజార్, జూలై 4 : భూస్వామ్య పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా కామ్రేడ్ దొడ్డి కొమురయ్య పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇప్టా జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, అరుణోదయ నాయకులు ఎర్ర ఉమేశ్, సామ నర్సిరెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. సూర్యాపేట పూర్వ మిత్రమండలి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. మండలి అధ్యక్షుడు నల్లకుంట్ల అయోధ్య, ప్రధాన కార్యదర్శి బయ్య మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు నల్లపాటి అప్పారావు, వీరన్న పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : నోములలో పీహెచ్‌సీ ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మెరుగైన వైద్య సేవలందించేందుకే ఆరోగ్య ఉపకేంద్రం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూలై 4 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నోములలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని నిర్మిస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. సుమారు రూ.20 లక్షలతో ఉపకేంద్ర భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పీపీఆర్ ఏఈ సంపత్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సామ మల్లమ్మ, నాయకులు సామ రవీందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, గాదగోని కొండయ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన 55 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.25లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంపీడీఓ ఉమేశ్, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యుడి మృతికి పలువురి సంతాపం

కోదాడ రూరల్, జూలై 4: మండలంలోని ఎర్రవరం పీఏసీఎస్ సభ్యుడు బూర సైదులు(60) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చైర్మన్ నలజాల శ్రీనివాస్‌రావు గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు,రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, జూలై 4 : ఈ నెల 5,6 తేదీలలో నేరేడుచర్ల పట్టణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా నేరేడుచర్ల టౌన్ –1 ఫీడర్ పరిధిలోని మసీదు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేక విద్యార్థుల అవస్థలు

మఠంపల్లి, జూలై 4 : స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారు. అయితే అందులో ఆర్ఐ రమణారావు అనారోగ్యం కారణంగా సంవత్సరం నుంచి సెలవులో ఉండగా.. అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరిప్రసాద్ సైతం వారం రోజులుగా సెలవులో ఉన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన ప్రస్తుత తరుణంలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ఆర్ఐ లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్న దని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- కనగల్ మండలంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్
- చందంపేటలో యువకుడు

నల్లగొండ సిటీ, జూలై 4 : నల్లగొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కనగల్ మండలం బాబాసాయిగూడెం చెందిన కాంగ్రెస్ నాయకుడు నల్లబోలు సైదిరెడ్డి(50) గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఉదయం పొలం దున్నుతుండగా ట్రాక్టర్‌కు తగిలి విద్యుత్ తీగలు కింద పడ్డాయి. వాటిని సైదిరెడ్డి తొలగిస్తుండగా షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గ్రామంలో సైదిరెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైదిరెడ్డి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

సైదిరెడ్డి, అనిల్ (ఫైల్)

స్ప్రింక్లర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండగా..

చందంపేట :చందంపేట మండల కేంద్రంలో గురువారం విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం వివరాలి ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కోమండ్ల రాములు, కలమ్మ దంపతుల కుమారుడు అనిల్(22) గురువారం పొలంలో స్ప్రింక్లర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండగా షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృత్యుడు అవివాహితుడు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసిన అనిల్ వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేందుకు వచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం

తిరుమలగిరి (సాగర్), జూలై 4: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన రంగుండ్లతండా, ఎల్లాపురం తండాకు చెందని ఆంగోతు రవినాయక్ పద్మల కుమారుడు ఆంగోతు నందతోపాటు రమావత్ స్వామినాయక్, మంగి కుమారుడు రమావత్ సర్దార్‌ను గురువారం ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ గురువారం సన్మానించారు. ఒక్కొక్కరికీ రూ.5వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వినయ్‌కుమార్, అమృతయ్య, జార్జ బాను, మాజీ సర్పంచ్ భిక్షనాయక్, మాజీ ఎంపీటీసీ దేవ్‌నాయక్ పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న అనిల్‌కుమార్

వనిపాకల పాల సంఘానికి ఎన్నిక నిర్వహించాలని ధర్నా

చిట్యాల, జూలై 4 : మండలంలోని వనిపాకల పాల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని, పాల సంఘం సభ్యుల వివరాలు తెలపాలని కోరుతూ చిట్యాల పాల శీతలీకరణ కేంద్రం వద్ద ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. వనిపాకల పాల సంఘానికి చాలా ఏండ్లుగా సంఘం సభ్యుల వివరాలు తెలపకుండా గోప్యంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. వెంటనే తమకు సంఘం సభ్యుల వివరాలు అందజేయాలని మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కట్టగూరి మల్లేశ్, ఏళ్ల వ